సాక్షి నల్లగొండ

సోమవారం । 2 । డిసెంబర్ । 2024



వసతుల కల్పనకు ప్రాధాన్యం

గురుకులాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. - 10లో



గుర్తింపు తీసుకురావాలి

క్రీడల్లోనూ మహాత్మాగాంధీ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలని వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. - 10లో



అమావాస్య పూజలు

కార్తీక మాసం చివరి రోజు, అమావాస్య సందర్భంగా చెర్వుగట్టులో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. - 10లో

న్యూస్‌రీల్

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

త్రిపురారం : నిడమనూరు మండల కేంద్రంలో టీఎస్ మోడల్ స్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయుడు ఆంజనేయులును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి ఆదిఆవరం ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్ భూరుగు నిర్మలకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. టీఎస్ మోడల్ స్కూల్‌లో విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడనే ఆరోపణల నేపథ్యంలో ఆంజనేయులను సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

యాదవులకు ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న చలకాని వెంకన్నయాదవ్

నకిరేకల్ : ప్రభుత్వంలో యాదవులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకన్న యాదవ్ డిమాండ్ చేశారు. యాదవ విద్యావంతుల వేదిక నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు సమావేశం ఆదివారం నకిరేకల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యాదవులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ వ్యాప్తంగా రాబేయో 10 రోజుల్లో యాదవ విద్యావంతుల కమిటీలను నియమిస్తామన్నారు. నకిరేకల్ నియోజకవర్గ యాదవ విద్యావంతుల మహిళ విభాగం అధ్యక్షురాలిగా ఏర్పుల రేణుకను నియమించారు. ఆ సంఘం నాయకుడె బోళ్ల సత్తయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు నోముల సైదులు, శేష, కొమ్మనబోయిన సైదులు, యశబోయిన పాండు, గుడిపాటి రాజు, వీరబోయిన గురుస్వామి, ముక్కాముల శేఖర్, సుంకరబోయిన వెంకన్న, తరాల శ్రైలం తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతసేవ, స్వయంభూల, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహా హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను భక్తుల మధ్య ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు.

డెయిరీని లాభాల్లోకి తీసుకొస్తాం



మాట్లాడుతున్న గుడిపాటి మధుసూదన్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: మదర్ డెయిరీని లాభాల బాట పట్టించేందుకు సమష్టి కృషిచేస్తామని మదర్ డైయిరీ ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి తెలిపారు. భువనగిరిలోని మిల్క్ చిల్లింగ్ సెంటర్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కాలంలో డెయిరీని నష్టాలపాలు చేశారని, పదవిపోగానే కొందరు తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వెన్న అమ్మకాల్లో ఎలాంటి అక్రమాలు లేవన్నారు. పాల ఉత్పత్తిదారులకు ప్రతి 15 రోజులకు ఒకసారి బిల్లులు చెల్లించాలన్న లక్ష్యంతో ముందుకుపోతున్నామని చెప్పారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు గూడూరు శ్రీధర్‌రెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి, బత్తుల నరేందర్‌రెడ్డి, కల్లెపల్లి శ్రీశైలం, పుప్పాల నర్సింహులు ఉన్నారు.

● కలెక్టరేట్ ముస్తాబు



● కార్తీక దీపోత్సవం



ప్రజా పాలన ఉత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలతో అలంకరించిన కలెక్టరేట్, కార్తీకమాసం చివరిరోజు సందర్భంగా నల్లగొండలోని రామకోటి స్తూప దేవాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఫొటోలు : సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

21,432 మందికి.. రూ.236.90 కోట్లు

- నాలుగో విడత రుణమాఫీ అర్హుల జాబితా విడుదల
- లిస్ట్‌లను బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులకు పంపిన ప్రభుత్వం
- త్వరలోనే రైతులకు దక్కనున్న రుణమాఫీ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రైతులకు రూ.2 లక్షల లోపు రుణమాఫీ హామీలో భాగంగా జిల్లాలో నాలుగో విడతలో 21,432 మంది రైతులకు రూ.236.90 కోట్ల రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే మూడు విడతల్లో రుణమాఫీ చేసిన ప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీకి సంబంధించిన అర్హుల జాబితాను ఆదివారం విడుదల చేసింది. నాలుగో విడత రుణమాఫీకి చర్యలు చేపట్టాలని బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంతో రుణమాఫీ కాని రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ విడతలోనైనా వారి పేరు జాబితాలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మూడు విడతల్లో రుణమాఫీ..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను జూలై నెలలో ప్రారంభించింది. జిల్లాలో ఇప్పటివరకు మొత్తంగా 2,12,486 మంది రైతులకు రూ.1,767.98 కోట్ల రుణాలను మాఫీ చేసింది. అందులో మొదటి విడతలో జూలై 18వ తేదీన 1,05,197 మంది రైతులకు రూ.579.14 కోట్ల రుణమాఫీ చేసింది. రెండో విడతగా జూలై 30వ తేదీన 63,014 మంది రైతులకు రూ. 632.92 కోట్లు, ఆగస్టు 15వ తేదీన మూడో విడతలో 44,275 మంది రైతులకు సంబంధించి రూ.555.92 కోట్ల రుణమాఫీ చేసింది. ఆ తరువాత రుణమాఫీ ప్రక్రియను నిలిచిపోయింది. దీంతో మిగతా రైతులు తమకు రుణమాఫీ కాలేదంటూ ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం నాలుగో విడత రుణమాఫీ అర్హుల జాబితాను విడుదల చేసింది. ఈసారైనా అందరిని పరిగణనలోకే తీసుకుందా? లేదా కొందరినే పరిగణనలోకి తీసుకుందా? అన్నది త్వరలోనే తేలనుంది. నాలుగో విడత రుణమాఫీ అర్హులకు సంబంధించిన జాబితాలను జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకులకు పంపించినట్లు తెలిసింది.

ప్రజాపాలన ఉత్సవాలు ప్రారంభం

నల్లగొండ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికావస్తున్న సందర్భంగా ప్రభుత్వం ప్రజాపాలన సంబరాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈనెల 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రోజు వారి కార్యక్రమాలను నిర్వహించనుంది. తొలిరోజు ఆదివారం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో 2కె రన్ చేపట్టారు. ప్రభుత్వ, 2వ తేదీన ప్రైవేట్ పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నారు. 3వ తేదీన ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో, 4వ తేదీన ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ఆటల పోటీలు నిర్వహించనున్నారు. 5వ తేదీన ప్రజాప్రతినిధులు, అధికారుల ఆటలు పోటీలు, 6వ తేదీన యోగాతోపాటు ఇతర వ్యాయామ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 7, 8 తేదీల్లో క్విక్ ఆఫ్ పీఎం కప్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

బెనిఫిట్స్ కొందరికేనా!

- అంగన్‌వాడీలకు పూర్తిస్థాయిలో అందని రిటైర్‌మెంట్ ప్రయోజనాలు
- జిల్లాలో రిటైర్డైంది 58 మంది టీచర్లు, 168 మంది ఆయాలు
- 43 మంది టీచర్లకే ఆర్థికసాయం
- ఎదురుచూపుల్లో ఆయాలు, మిగతా టీచర్లు



నల్లగొండ: ఈ ఏడాది ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలందరికీ ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసాయం పూర్తిస్థాయిలో అందక ఐదు నెలలుగా ఎదురుచూస్తున్నారు. రాష్ట్రంలో 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీలకు రిటైర్‌మెంట్ ప్రకటించిన ప్రభుత్వం వారిని ఉద్యోగాల నుంచి తొలగించింది. ఈ ఏడాది జూలై 1 నుంచి వారికి జీత భత్యాలు కూడా నిలుపుదల చేసింది.

226 మంది ఉద్యోగ విరమణ పొందితే..

జిల్లాలో 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీలు 226 మంది ఉద్యోగ విరమణ పొందారు. వీరిలో 58 మంది టీచర్లు, కాగా 168 మంది ఆయాలు ఉన్నారు. వీరిలో టీచర్లకు ఇప్పటి వరకు 43 మందికే లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందింది. వీరికి ఇంకా మరో రూ.లక్ష అందించాల్సి ఉంది. మిగిలిన 15 మందికి అసలు ఆర్థిక సాయమే అందలేదు. కాగా 168 మంది ఆయాలు రిటైర్ కాగా అందులో ఒకరికి కూడా ఇప్పటి వరకు రూ.లక్ష సాయం అందించలేదు. దీంతో ఆర్థిక సాయం అందని టీచర్లు, ఆయాలకు ఐదు నెలలుగా ఎదురుచూపులు తప్పడం లేదు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

రిటైర్ అయిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సంబంధించి టీచర్లకు కొందరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేశాం. పెంచిన రూ.లక్ష అందించాల్సి ఉంది. ఆయాలకు కూడా ఇంకా చెల్లింపులు జరగలేదు. అందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం.

– కృష్ణవేణి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి, నల్లగొండ

ఆందోళనలతో ఆర్థికసాయం పెంపు

గతంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందిన ఎలాంటి ఆర్థిక సాయం అందేది కాదు. ఈ నేపథ్యంలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద టీచర్లకు రూ.5లక్షలు, ఆయాలకు రూ.2 లక్షలు చెల్లించాలని ఆందోళన చేపట్టారు. దీంతో గతం ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఉద్యోగ విరమణ వయసు 65 ఏళ్లుగా ఖరారు చేసింది. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందించాలని ఉత్తర్వులు ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ అధికాకారంలోకి వచ్చాక తమకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సరిపోదని మరోమారు అంగన్‌వాడీలు ఆందోళన చేయడంతో గత జూలైలో రిటైర్‌మెంట్ బెనిఫిట్‌గా టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున ఇస్తామని ప్రకటించింది. ప్రస్తుతం రిటైర్ అయిన వారికి ప్రభుత్వం చెల్లిస్తామన్న ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు.

సీపీఎం జిల్లా మహాసభలకు ముస్తాబు



రాజీవ్‌చౌక్ వద్ద ఏర్పాటు చేసిన తోరణాలు



సభా వేదికను పరిశీలిస్తున్న సుధాకర్‌రెడ్డి

- మిర్యాలగూడలో నేటినుంచి మూడు రోజులపాటు నిర్వహణ
- నేడు ప్రదర్శన, బహిరంగ సభ
- హాజరుకానున్న పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు

మిర్యాలగూడ : సీపీఎం నల్లగొండ జిల్లా 21వ మహాసభలకు మిర్యాలగూడ ముస్తాబైంది. మహాసభల కోసం ఆహ్వాన సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పట్టణంలోని సాగర్‌రోడ్డు, నల్లగొండ, ఖమ్మం రోడ్లకు ఇరువైపులా ఎర్ర తోరణాలతో అలంకరించారు. మల్లు స్వరాజ్యం, మల్లు వెంకట్‌రెడ్డి, ఆరిబండి లక్ష్మీనారాయణ, చల్లా సీతారాంరెడ్డి, గట్టికొప్పుల రాంరెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మహాసభలను జయప్రదం చేయాలంటూ వాల్ రైటింగ్ చేశారు. ఏ వీధికి వెళ్లినా ఎర్రని జెండాలే కనిపిస్తున్నాయి.

పట్టణంలో నేడు భారీ ప్రదర్శన

సీపీఎం జిల్లా మహాసభలు సోమవారం నుంచి బుధవారం వరకు జరగనున్నాయి. సోమవారం మధ్యాహ్నం సాగర్ రోడ్డులోని ఫ్లైఓవర్ నుంచి ఎన్ఎస్‌పీ క్యాంపు వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. కోలాటదళం, డప్పు కళాకారులతో పాటు విచిత్ర వేషధారణలు, రెడష్ షర్ట్ వలంటీర్లు ఈ ప్రదర్శనలో పాల్గొననున్నారు. అనంతరం ఎన్ఎస్‌పీ క్యాంపులో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సభకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, మల్లు లక్ష్మి హాజరుకానున్నారు. సభకు సీపీఎం శ్రేణులు భారీగా తరలిరానున్నాయి.

జిల్లా సమగ్రాభివృద్ధికి బలమైన పోరాటాలు

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం భవిష్యత్‌లో బలమైన పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు చేస్తామని అందుకు మిర్యాలగూడలో జరిగే సీపీఎం 21వ జిల్లా మహాసభలు వేదిక కాబోతున్నాయన్నారు. మూడు సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించామని, పాదయాత్రలు చేపట్టామని తెలిపారు. సోమవారం 15వేల మందితో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బహిరంగ సభ వేదికను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, శశిధర్‌రెడ్డి, మహేష్, ఖమ్మంపాటి శంకర్, రొండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నిక

నల్లగొండ అగ్రికల్చర్ : సమగ్రశిక్షా ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కుమార్ సమక్షంలో ఆదివారం నల్లగొండలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెలుగూరి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బొమ్మగాని రాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొండ చంద్రశేఖర్, కోశాధికారిగా పుష్పలత, మహిళ అధ్యక్షురాలిగా గుమ్మల మంజుల రెడ్డి, మహిళా కార్యదర్శిగా సావిత్రి, ఉపాధ్యక్షులుగా లలిత, ఎర్రమళ్ల నాగయ్య, రాము, వెంకన్న, రమేష్, వెంకట్, జిల్లా కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, రమాదేవి, సుజాత, సహదేవ్, వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శులుగా చందపాక నాగరాజు, బంటు రవి, అసోసియేట్ అధ్యక్షులుగా యాట వెంకట్, దార వెంకన్న, శ్రీరాములు, శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా కంచర్ల మహేందర్, నీలాంబరి, పాండు నాయక్, హసీం బాబా, వసంత పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



సమగ్రశిక్షా ఉద్యోగుల నూతన కార్యవర్గం

మూడు నెలలు.. 363 కాన్పులు

దేవరకొండ ప్రభుత్వాసుపత్రిలో పెరుగుతున్న ప్రసవాలు

- పెద్ద ఎత్తున తరలివస్తున్న గర్భిణులు
- అన్నిరకాల సేవలు, వైద్యులు అందుబాటులో ఉండడమే కారణం
- తాజాగా ఒక్కరోజులోనే 14 కాన్పులు చేసిన డాక్టర్లు



కాన్పుల వార్డులో బాలింతలు

దేవరకొండ: దేవరకొండ ప్రభుత్వాసుపత్రిలో రోజురోజుకూ ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వం ఎంసీహెచ్ కిట్ తోపాటు నగదు ప్రోత్సాహకాలు అందిస్తుండడంతో ఈ ఆసుపత్రిలో కాన్పు చేయించుకునేందుకు గర్భిణులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. గడిచిన మూడు నెలల కాలంలో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రికార్డు స్థాయిలో 363 ప్రసవాలు జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. తాజాగా ఇదే ఆసుపత్రిలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు 24 గంటల సమయంలో వైద్యులు 14 మంది గర్భిణులకు కాన్పులు చేయడం విశేషం.

కాన్పుల వివరాలు ఇలా..

నెల	కాన్పులు
సెప్టెంబర్	117
అక్టోబర్	127
నవంబర్	119

మెరుగైన సేవలు అందుతుండడంతో..

గతంతో పోల్చితే ప్రస్తుతం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. ముఖ్యంగా ఆసుపత్రిలో నవజాత శిశువుల కోసం ఎస్–ఐసీయూ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ ద్వారా శిశువులకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఫొటోథెరపీ ద్వారా నవజాత శిశువులకు వైద్యం చేస్తున్నారు. దీనికితోడు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన గర్భిణులకు ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా కాన్పులు చేస్తున్నారు. గడిచిన మూడు నెలల కాలంలో సాధారణ, ఆపరేషన్ల ద్వారా 363 ప్రసవాలు జరిగాయంటే ఇక్కడ ఏ స్థాయిలో జరుగుతున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ ఆసుపత్రిలో గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తుండడంతో నియోజవర్గంలో వివిధ మండలాల నుంచి ప్రతిరోజూ పెద్ద ఎత్తున తరలివచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. దీంతో ఈ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇదేకాక నిత్యం వందల సంఖ్యలో ఇక్కడ ఓపి నమోదు అవుతుందని వైద్యులు పేర్కొంటున్నారు.

మెరుగైన సేవలు అందిస్తున్నాం



దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. ఆసుపత్రిలో ఇటీవల ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. అన్ని విభాగాలకు సంబంధించి వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యం చేస్తున్నాం. ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలు దేవరకొండ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– మంగ్తానాయక్, సూపరింటెండెంట్, దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి

ఆసుపత్రిలో 26 మంది వైద్యులు

దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో 26 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వీరితోపాటు 34 సిబ్బంది పనిచేస్తున్నారు. గైనకాలజిస్ట్, అనస్తీషియా, పిడియాట్రీషన్, పల్మనాలజిస్ట్, జనరల్ సర్జన్, డెంటల్ విభాగాల్లో వైద్యులు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ ఆసుపత్రిని రెండు వందల పడకల ఆసుపత్రిగా మార్చేందుకు ఇటీవల స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఆసుపత్రిని విస్తరిస్తే దేవరకొండ ప్రాంత ప్రజలకు మరిన్ని వైద్యసేవలు అందనున్నాయి.

● క్రికెట్ పోటీలు ప్రారంభం





కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ఎన్జీ కాలేజీలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం సందర్భంగా బ్యాటింగ్ చేస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, బౌలింగ్ చేస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

క్లుప్తంగా

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


వేణుకుమార్ రెడ్డి (ఫైల్)

నార్కట్‌పల్లి: ఇరవై రోజుల క్రితం ఎంగేజ్‌మెంట్ చేసుకున్న యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపలాయపల్లి గ్రామానికి చెందిన కామసాని వేణుకుమార్‌రెడ్డి(29) గతంలో దక్షిణాఫ్రికా దేశంలో బోర్‌వెల్ వాహనంపై పనిచేశాడు. గత మూడు నెలల నుంచి గ్రామంలోనే ఉంటున్నాడు. వేణుకుమార్‌రెడ్డికి వివాహం చేయడానికి కుటుంబ సభ్యులు 20 రోజుల క్రితం ఎంగేజ్‌మెంట్ చేశారు. ఏమైందో ఏమో గాని శనివారం రాత్రి గ్రామ సమీపంలోని వారిజాల వేణుగోపాలస్వామి దేవాలయానికి వెళ్లే దారిలో రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి తాను ఆత్మహత్య చేసకుంటున్నట్లు స్నేహితులకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే అతడి స్నేహితులు రైలు పట్టాల వద్దకు వెళ్లే సరికి అప్పటికే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. తనకు ఇష్టం లేకుండా పెళ్లి చేస్తుండడంతోనే మనస్తాపం చెంది వేణుకుమార్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టిన లారీ


ధ్వంసమైన లారీ

చౌటుప్పల్ రూరల్: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం ఖైతాపురం గ్రామ స్టేజీ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఓ లారీ రోడ్డు పక్కన బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి బీడ్(హైరన్) లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ ఖైతాపురం గ్రామ స్టేజీ వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులో రోడ్డు పక్కన బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లారీ ధ్వంసమైంది. ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఆదివారం చిట్యాల ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం రామలింగంపల్లి గ్రామానికి చెందిన మండల సర్వయ్య(63), అంబటి గోపి కలిసి నవంబర్ 26వ తేదీన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో చిట్యాల వద్ద హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వీరి వెనుకే వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనక కూర్చున్న సర్వయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జడ్జి కారును ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం

చౌటుప్పల్ రూరల్: ఖమ్మం జిల్లా జడ్జి ఆదివారం కారులో ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు కుడి భాగం దెబ్బతింది. కారు డ్రైవర్ వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

కలవరపెడుతున్న ఫెంగల్ తుపాను

- అన్నదాతల్లో గుబులు పుట్టిస్తున్న మబ్బులు
- పలుచోట్ల వర్షాలు
- తీవ్రంగా నష్టపోతామంటున్న రైతులు


చేను పైనే ఉన్న పత్తి

పెద్దవూర: గత రెండు, మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండడంతో పాటు అక్కడక్కడ కురుస్తున్న జల్లులతో రైతులు కలవరపాటుకు గురవుతున్నారు. బంగాళా ఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను కారణంగా వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి ముసురు వర్షం కురిసింది. ఫెంగల్ తుఫాన్ వాయుగుండంగా మారడంతో అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించటంతో రైతులు హడలిపోతున్నారు. ప్రస్తుతం కోత దశలో ఉన్న వరి, చేతి కొచ్చిన పత్తి పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వరి పంటలు కోస్తుండగా, పత్తి రెండోతీత ప్రారంభమైంది. వానలొస్తే పత్తి, వరి, మిరప పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లనుందని రైతులు భయాందోళనలు చెందుతున్నారు.

పత్తి నాణ్యతకు దెబ్బే..

పెద్దవూర మండలంలో వానాకాలం సీజన్‌లో దాదాపు 20వేల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. ప్రస్తుతం క్వింటా పత్తి రూ.7వేలకు పైనే ధర పలుకుతోంది. ప్రస్తుతం పత్తి చేలలో రెండో తీత మొదలైంది. ఇప్పుడు వర్షాలు పడితే చేను పైన ఉన్న పత్తి నాణ్యత దెబ్బతింటుందని రైతులు భయపడుతున్నారు. ఎడతెరిపి లేకుండా రెండు, మూడు రోజుల పాటు వర్షాలు పడితే పత్తి చేను పైనే తడిసి మొలకలు వచ్చే ప్రమాదం ఉంది.

కోత దశలో వరి

నాన్ ఆయకట్టు ప్రాంతమైనా బోర్లు, బావులు, చెరువులు, వాగులు, ఏఎమ్మార్పీ కాలువల కింద మండలంలో వానాకాలంలో 10వేల ఎకరాలకు పైగా వరిని సాగు చేశారు. కొన్ని ప్రాంతాలలో కోతలు పూర్తికాగా మరికొన్ని ప్రాంతాలలో కోత దశలో ఉన్నాయి. ప్రస్తుత తుపానుతో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు పడితే గాలుల ప్రభావంతో పంట నేలవాలుతాయి. వడ్లు రంగుమారి నాణ్యత దెబ్బతినడంతో పాటు మొలకెత్తే అవకాశాలు ఉన్నాయి.

కొనుగోలు కేంద్రాలలో ధాన్యం

ఆరుగాలం శ్రమించి సాగు చేసి పండించిన వడ్లు విక్రయించటానికి రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు చేర్చారు. తేమ శాతం లేకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాలలోనే రోజూ ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ ఉన్నారు. తుపాను కారణంగా వర్షాలు కురిస్తే ఎక్కడ ధాన్యం తడుస్తుందో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పత్తి అంతా చేను పైనే ఉంది



పత్తి మొదటితీత సమయంలోనూ వర్షంతో చేను పైనే తడిసింది. ప్రస్తుతం రెండోతీత తీద్దామని అనుకుంటుండగానే తుపాను ఉందని వాతావరణ కేంద్రం అధికారులు చెబుతుండటంతో భయమేస్తోంది. 10 ఎకరాల్లో పత్తి అంతా చేనుపైనే ఉంది. వర్షాలు వస్తే పత్తి నాణ్యత దెబ్బతినడంతో పాటు మొలకెత్తే ప్రమాదం పొంచి ఉంది. ఆ దేవుడే కాపాడాలి.

– కత్తి కనకాల్‌రెడ్డి, రైతు, బట్టుగూడెం

మిర్చికి తెగుళ్ల పీడ..

పెద్దవూర మండలంలో వానాకాలంలో 1000 ఎకరాలకు పైగా మిరప సాగు చేశారు. గతేడాది మిరపకు అధిక ధర పలకడంతో ఈ ఏడాది కూడా మండలంలోని బట్టుగూడెం, గర్నెకుంట, వెల్మ గూడెం, నాయినవానికుంటతండా, పెద్దవూర, పెద్దగూడెం, తెప్పలమడుగు, లింగంపల్లి తదితర గ్రామాలలో మిరప పంటను అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం మిరప పూత, కాత దశలో ఉన్నాయి. అధిక వర్షాలు కురిస్తే పంటకు తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉంది. ప్రధానంగా వేరుకుళ్లు ఆశిస్తే మొక్క దెబ్బతింటుందని రైతులు చెబుతున్నారు. ఏది ఏమైనా ఫెంగల్ తుపానుతో రైతులు బెంబేలెత్తుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చౌటుప్పల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని బొలేరో వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం జనంపల్లి గ్రామానికి చెందిన అక్కినపల్లి నరేష్(35) కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం బైక్‌పై శనివారం స్వగ్రామానికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో గల శ్రీబాలాజీ దేవాలయం సమీపంలో ఎదురుగా బొలేరో వాహనం వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నరేష్‌ను స్థానికులు చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బాధితుడి తండ్రి పొడయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

సైకిల్‌ను ఢీకొట్టిన కారు..

గరిడేపల్లి: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన గరిడేపల్లి మండలం అప్పన్నపేట గ్రామ సమీపంలో కోదాడ-మిర్యాలగూడ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాలు.. అప్పన్నపేట గ్రామానికి చెందిన మదార్ అమోర్ సైకిల్‌పై వెళ్తుండగా.. మేళ్లచెరువు నుంచి శబరిమలైకి అయ్యప్ప స్వాములతో వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మదార్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ చలికంటి నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని 108 వాహనంలో హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


వాహనంలో పట్టుబడిన రేషన్ బియ్యం

చింతపల్లి: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం పోలీసులు పట్టుకుని 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామానికి చెందిన జెనిగల మహేష్ ఆదివారం చింతపల్లి మండలం నసర్లపల్లి వైపు నుంచి హైదరాబాద్‌కు మారుతి ఈకో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా.. నసర్లపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు వాహనాన్ని పట్టుకున్నారు. వాహనంలో సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళపై దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు

చౌటుప్పల్ రూరల్: కుటుంబ కలహాలతో మహిళపై దాడి చేసిన ఘటన చౌటుప్పల్ మండలం దామెరా గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామెరా గ్రామానికి చెందిన తర్ర వెంకటేష్‌కు ఇద్దరు భార్యలున్నారు. వెంకటేష్ ఇటీవల మృతిచెందాడు. మొదటి భార్యకు ఒక కుమారుడు, రెండో భార్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి భార్య కుమారుడు తర్ర రమేష్, రెండో భార్య లక్ష్మమ్మ పెద్ద కుమారుడు తర్ర లింగస్వామి మధ్య ఆస్తి గొడవలు నడుస్తున్నాయి. ఇరువురికి ఉన్న భూమిని రమేష్ సాగు చేసుకుంటున్నాడు. తన వాటా భూమికి కౌలు ఇవ్వాలని ఆదివారం లక్ష్మమ్మ రమేష్‌ను అడగగా ఆమెపై దాడి చేశాడు. బావి దగ్గర ఉన్న పాకను పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఆమె ఇంటికి కూడా నిప్పంటించే ప్రయత్నం చేశాడు. బాధితురాలు లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

పెళ్లైన పది రోజులకే..

- గుండెపోటుతో యువకుడు మృతి

చౌటుప్పల్ రూరల్: పెళ్లైన పది రోజులకే గుండెపోటుతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం పెద్దకొండూర్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొండూర్ గ్రామానికి చెందిన బాణాల నవీన్‌రెడ్డి(28) బోర్‌వెల్స్ నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భూదాన్ పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన యువతితో గత నెల 18న వివాహం జరిగింది. ఆదివారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి వస్తుందని ట్యాబ్లెట్స్ కోసం ఇంటి నుంచి కారులో చౌటుప్పల్ వెళ్లిన నవీన్‌రెడ్డి తిరిగి ఇంటికి వస్తుండగా.. పెద్దకొండూర్ గ్రామ సమీపంలోకి రాగానే గుండెపోటు రావడంతో కారు రోడ్డు పక్కకు వెళ్లి ఆగింది. రోడ్డు వెంట వెళ్తున్న వారు నవీన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి దుర్మరణం

మిర్యాలగూడ టౌన్: ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం సాయంత్రం మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం గ్రామంలో జరిగింది. ఆదివారం మిర్యాలగూడ రూరల్ సీఐ పిల్లి లోకేష్ తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన పేరుపంగు మదన్(23) వరి కోత మిషన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన పాతకోటి శ్రీను పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. శనివారం సాయంత్రం ట్రాక్టర్‌ను వరి కోత మిషన్‌కు దగ్గరగా పెట్టి అందులోని వడ్లను ట్రాక్టర్‌లోకి తోడుతుండగా.. అదుపుతప్పి మదన్ కిందపడిపోయాడు. అదే సమయంలో ఆన్‌లోనే ఉన్న ట్రాక్టర్ ముందుకు వెళ్లగా.. మదన్ తల నుంచి ట్రాక్టర్ టైర్లు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం మృతుడి భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

జూదరుల అరెస్ట్

తిప్పర్తి: మండలంలోని చిన్నసూరారం గ్రామ పంచాయతీ పరిధిలోని పావురాలగూడెంలో పేకాట ఆడుతున్న పలువురిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. తిప్పర్తి ఎస్‌ఐ సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. పావురాలగూడెం గ్రామానికి చెందిన పాయలి శంకర్, పుట్ట సైదులు, మండల రాజు, చనగాని నగేష్, బండగొర్ల వీరయ్య డబ్బులు పెట్టి పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40,040, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెరుపల్లిలో ఏడుగురు..

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండలం చెరుపల్లి గ్రామంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేసి పేకాట ఆడుతున్న వారిని పట్టుకున్నారు. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చెరుపల్లి గ్రామ శివారులో చెరుపల్లి గ్రామానికి చెందిన కుక్కల రమేష్, చెరుకుపల్లి సైదులు, గంటకంపు రాములు, నవీన్, బొల్లం పెద్దిరాజు, బుర్రి పాపిరెడ్డి, మాడ్గులపల్లి మండల కేంద్రానికి చెందిన చంటిలు పేకాట ఆడుతుండగా పక్కా సమాచారం పోలీసులు వారిని పట్టుకుని వారి నుంచి రూ.7,400 నగదు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాగిరెడ్డిపల్లిలో..

భువనగిరి: పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో ఆదివారం కొందరు వ్యక్తులు పేకాట ఆడుతుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌హెచ్‌ఓ పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారు వలిగొండ మండలం టేకుల సోమారం గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. వారి నుంచి రూ. 21,610 నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

విద్యుదాఘాతంతో పంపు ఆపరేటర్ మృతి

కోదాడరూరల్: విద్యుదాఘాతంతో మున్సిపాలిటీలో పనిచేస్తున్న పంపు ఆపరేటర్ మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ పట్టణంలోని 12వ వార్డులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మున్సిపాలిటీలో ఎస్‌డీ. సయ్యద్‌గౌస్(48) పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం 12వ వార్డులో పంపులు పనిచేయడం లేదని ఫిర్యాదు రావడంతో మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. పైపులో నుంచి నీరు రాకపోవడంతో దానిని మిషన్‌తో కట్ చేస్తుండగా.. విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడి కుమారుడు కోదాడ పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన


వరి విత్తనాలు చల్లుతున్న బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు

గరిడేపల్లి: మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామంలో రైతుల పొలాలను ఆదివారం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పొలాల్లోకి దిగి వరి విత్తనాలు చల్లారు. అనంతరం వారు రైతులకు వరి విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థినులు గీతిక, హరిణి, కృష్ణవేణి, నందిని, హిరణ్మయి, లావణ్య, మేఘన, శ్రీవర్షి, రైతులు కారింగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో 8 మంది రిమాండ్

చందంపేట: మండల పరిధిలోని యల్మలమంద గ్రామ పంచాయతీ పరిధిలోని చాపలగేటు వద్ద నవంబర్ 27న భూ తగాదా విషయమై దాయాదుల మధ్య జరిగిన గొడవలో కేతావత్ సామ్య మృతిచెందాడు. ఈ కేసులో 8 మందిని ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు చందంపేట ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

హైవేపై విద్యుత్ కాంతులు


చౌటుప్పల్‌లో హైవేపై ఏర్పాటు చేసిన లైట్లు

చౌటుప్పల్ : ప్రజాపాలన విజయోత్సవాల నేపథ్యంలో చౌటుప్పల్ జాతీయ రహదారి జిగేల్‌మంటోంది. రోడ్డు మధ్య హైమాస్ట్ లైట్ల టవర్లను జాతీయ రహదారి నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకం మాదిరిగా విద్యుత్ దీపాలతో అలకరించారు. మిరమిట్లు గొలుపుతున్న విద్యుత్ కాంతులతో రహదారి ఆకర్షణీయంగా మారింది.

అప్పుల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య

నల్గొండ క్రైం: అప్పుల బాధ భరించలేక ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలనీలో ఆదివారం జరిగింది. వివరాలు.. ఎన్జీ కాలనీకి చెందిన శ్రీకాకొళ శ్రీనివాస్(47) జిరాక్స్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. దాంతో ఆదాయం ఎక్కువగా రాకపోవడంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాడు పడ్డాడు. అంతేగాకుండా డ్రైవర్‌గానూ పనిచేశాడు. అప్పులు ఎక్కువై వాటిని ఎలా తీర్చాలో తెలియక ఆదివారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

దేవరకొండ: మద్యానికి బానిసైన యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం దేవరకొండల పట్టణంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన దామిద్ర ఆంజనేయులు(30) కొంతకాలంగా దేవరకొండ పట్టణంలోని బీఎన్‌ఆర్ కాలనీలో భార్య స్పందనతో కలిసి ఉంటూ ఎలక్ట్రీషియన్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి మద్యానికి బానిసైన ఆంజనేయులు ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. డిండి మండలం చెర్కుపల్లికి వెళ్లిన అతడి భార్య స్పందన ఇంటికి వచ్చేసరికి ఆంజనేయులు మృతిచెంది ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

టైర్ల రీసైక్లింగ్ కంపెనీలు వద్దని రైతుల ఆందోళన


టైర్ల రీసైక్లింగ్ కంపెనీ పనులను నిలిపివేయాలని ఆందోళన చేస్తున్న కాటేపల్లి గ్రామ రైతులు

మోటకొండూర్: మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న రెండు టైర్ల రీసైక్లింగ్ కంపెనీలు తమకు వద్దని స్థానిక రైతులు ఆదివారం ఉదయం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఊరికి సమీపంలో పంటలు పండే పొలాల మధ్య ఇలాంటి కంపెనీలు పెడితే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు దృష్టికి తీసికెళ్లినా ఎలాంటి స్పందన లేదని వాపోయారు. రెండు కంపెనీలతో కాటేపల్లి గ్రామ ప్రజలు, పాడి పశువులు అనారోగ్యాల బారిన పడతాయని, పంటలు నాశనమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ రెండు టైర్ రీసైక్లింగ్ కంపెనీ పనులను ఇక్కడ నుంచి తరలించాలని కోరారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంత్రి రాజు, మంత్రి దేవులు, పచ్చిమట్ల సత్తయ్య, వెంకటయ్య, ప్రభాకర్, పచ్చిమట్ల మధు, రైతులు పాల్గొన్నారు.

స్థలం బదలాయింపే సమస్య!

రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటులో జాప్యం

- రెండేళ్ల క్రితమే ఎయిమ్స్‌కు ఆరు ఎకరాల భూమి అప్పగింత
- రిజిస్ట్రేషన్ చేయడంలో తాత్సారం
- కేంద్రం విడుదల చేసిన నిధులు వెనక్కి
- అందుబాటులోకి వస్తే వేలాది మందికి కార్పొరేట్ వైద్య సేవలు


మినీ ఎయిమ్స్‌కు కేటాయించిన భూమి

బొమ్మలరామారం : గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు విస్తరించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయాలనుకున్న రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ కలగానే మిగిలిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలో ఆరెకరాల స్థలం కేటాయించి రెండేళ్లు కావస్తున్నా అడుగు ముందుకు పడడం లేదు. ఎయిమ్స్‌కు భూమిని అప్పగించిన రెవెన్యూ శాఖ.. సంస్థ పేరిట బదలాయింపు చేయకుండా తాత్సారం చేస్తుందన్న విమర్శలున్నాయి. మినీ ఎయిమ్స్ అందుబాటులోకి వస్తే యాదాద్రి జిల్లాతో పాటు మల్కాజిగిరి, మేడ్చల్ జిల్లాల్లోని కీసర, శామీర్‌పేట మండలాల ప్రజలకు కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి.అంతేకాకుండా బీబీనగర్ ఎయిమ్స్‌పైనా ఒత్తిడి తగ్గనుంది.

రూ.10 కోట్లతో ఏర్పాటు చేయాలని నిర్ణయం

జిల్లాలోని బొమ్మలరామారం మండలంలో రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ (ఆర్‌హెచ్‌టీసీ)పేరిట మినీ ఎయిమ్స్ ఏర్పాటు చేయాలని బీబీనగర్ ఎయిమ్స్ నిర్ణయించింది.ఇందుకోసం రూ.10 కోట్లతో ప్రత్యేకంగా భవన సముదాయాలు నిర్మించాలని ప్రణాళిక రూపొందించింది. తొలుత బొమ్మలరామారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాత్కాలికంగా హెల్త్‌కేర్ సెంటర్ ఏర్పాటు చేసి సేవలందిస్తోంది. ఇక్కడే శాశ్వతంగా సేవలు కొనసాగించేందుకు ఎయిమ్స్ అధికారులు ప్రతిపాదించగా.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అంగీకరించింది. పది ఎకరాల భూమి కేటాయించాలని 2021లో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. ఈ మేరకు 2022 డిసెంబర్‌లో మాల్యాల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 199లో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం కేటాయించింది. అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అడ్వాన్స్ పొజిషన్ జారీ చేస్తూ రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం ఎయిమ్స్ బడ్జెట్ నుంచి రూ.10 కోట్లు కేటాయించారు. 2024 డిసెంబర్ వరకు మినీ ఎయిమ్స్ పూర్తి చేసి వైద్యసేవలను ప్రారంభించాల్సి ఉంది.

కారణాలివీ..

సంస్థ పేరున భూమి బదలాయింపులో జరుగుతున్న జాప్యం.. మినీ ఎయిమ్స్ నిర్మాణానికి ఆటంకంగా మారింది. 6 ఎకరాల భూమికి స్థానిక మార్కెట్ వాస్తవ విలువ ఎకరం రూ.80 లక్షలుగా ఉంది. ఎకరం రూ.50 లక్షల లోపు ఉంటేనే ఎయిమ్స్ పేరున బదలాయింపు చేసే అధికారం కలెక్టర్‌కు ఉంటుందని, అంతకుమించి విలువ చేస్తే సీసీఎల్‌ఏ పరిధిలో ఉంటుందని రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది. భూ బదలాయింపు అంశం తమ పరిధిలో లేదని, రాష్ట్ర క్యాబినెట్‌లో చర్చించి ఆమోదం పొందాల్సి ఉంటుందన్నారు.

ప్రయోజనాలెన్నో..

మినీ ఎయిమ్స్ అందుబాటులోకి వస్తే జిల్లాలోని బొమ్మలరామారం, తుర్కపల్లి, బీబీనగర్ మండలాలతో పాటు పొరుగు జిల్లాల ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందనున్నాయి. 30 పడకల ఆస్పత్రి, 25 మంది వైద్య విద్యార్థులకు టీచింగ్ అండ్ లెర్నింగ్‌తో పాటు వసతి గృహాలు, మెడికల్ రీసెర్చ్ సెంటర్, అత్యవసర వైద్యం కోసం రోగులను తరలించేందుకు అంబులెన్స్‌లో సమకూరనున్నాయి.

అడ్వాన్స్ పొజిషన్ ఇచ్చాం



అప్పటి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మల్యాల గ్రామంలోని 199 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో 6 ఎకరాల భూమిని 2022 డిసెంబర్‌లోనే ఎయిమ్స్‌కు అప్పగించాం. మల్యాల పరిధిలో భూమి విలువ వాస్తవిక మార్కెట్ విలువ ఎకరం రూ.80లక్షలు ఉన్నందున భూ బదలాయింపు సీసీఎల్‌ఏ పరిధిలోకి వస్తుంది.

– శ్రీనివాస్‌రావు, బొమ్మలరామారం తహసీల్దార్

సద్వినియోగం చేసుకోవాలి



మినీ ఎయిమ్స్ రావడం బంగారం లాంటి అవకాశం. సద్వినియోగం చేసుకునేందుకు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా బొమ్మలరామారం మండలం చాలా గ్రామాలు మారుమూలన ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. హైదరాబాద్ వెళ్లేచ్చే క్రమంలో ఎంతోమంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. అటువంటి వారికి అత్యవసర వైద్యం అందనుంది.

– మేకల ధన్‌రాజ్, బొమ్మలరామారం

వెనక్కి వెళ్లిన నిధులు


బొమ్మలరామారం పీహెచ్‌సీలో మూలనపడ్డ మినీ ఎయిమ్స్ బోర్డు

మినీ ఎయిమ్స్‌కు భూమి కేటాయించిన అనంతరం 2022, 2023 సంవత్సరాల్లో రెండు పర్యాయాలు రూ.10 కోట్ల చొప్పున కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యాయి. కానీ, సంస్థ పేరున భూ బదలాయింపు జరగకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లినట్లు ఎయిమ్స్ వర్గాలు తెలిపాయి. మరో పర్యాయం నిధులు మంజూరై భూమి రిజిస్ట్రేషన్ చేయకపోతే మినీ ఎయిమ్స్‌ను మరో ప్రాంతానికి తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

నేడు నీటి విడుదల

శాలిగౌరారం: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు నుంచి యాసంగి పంటకు సోమవారం నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు నీటి పారుదల శాఖ డీఈఈ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. నీటి విడుదల కార్యక్రమానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

4న పల్స భిక్షం వర్ధంతి సభ

నకిరేకల్ : శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామంలో ఈ నెల 4న జరనున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ నేత పల్స భిక్షం 19 వర్ధంతి సభను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన ప్రచార కరపత్రాలను నకిరేకల్‌లో ఆదివారం ఆపార్టీ జిల్లా నాయకుడు ఇందూరు సాగర్, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి విడుదల చేశారు. కార్యక్రమంలో మామిడోజు వెంకటేశ్వర్లు, బీవీ చారి, పిట్టల అనిల్, అంబటి నర్సయ్య, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్లు

నల్లగొండ టౌన్ : స్థానిక సత్యవతి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డాక్టర్ మల్లు అరుణ్‌కుమార్ ప్రతి సంవత్సరం పేదలకు ఉచితంగా మోకాలు మార్పిడి చికిత్స నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ పుల్లారావు, ఆస్పత్రి చైర్మన్ సూరెపల్లి సత్యనారాయణ, డాక్టర్ రమేష్, డాక్టర్ మనోహర్, డాక్టర్ సంపద, డాక్టర్ చైతన్య, శ్రీశైలం, పవన్, నరేష్, వినయ్ పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న కోడి శ్రీనివాసులు

చండూరు : పేదలను ఆదుకోవడం ఎంతో సంతోషంగా ఉందని గాంధీజీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోడి శ్రీనివాసులు–అరుణ దంపతులు అన్నారు. గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 20 మంది పేదలకు నిత్యావసర సరుకులు అందజేసే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, బోడ యాదయ్య, యాదగిరి, బోడ విజయ్, గోపి పాల్గొన్నారు.

కుమ్మరి వృత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా నరేష్



చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శ్రీ పాండురంగ కుమ్మరి వృత్తిదారుల సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీలకంఠం నరేష్, ఉపాధ్యక్షుడిగా సిలివేరు గోపాల్, ప్రధాన కార్యదర్శిగా ఊట్కూరి రమేష్, కోశాధికారిగా నీలకంఠం కిష్టయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నీలకంఠం ముత్తయ్య, సిలివేరు లింగయ్య, యాదయ్య, నర్సింహ, సత్తయ్య, లింగస్వామి, బాలకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్: ఢిల్లీలో ఈ నెల 6,7,8 తేదీల్లో జరనున్న మహిళా సమాఖ్య మహాసభలకు మహిళలు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని నల్లగొండ నియోజకవర్గ సీపీఐ ఇన్‌చార్జ్ పబ్బు వీరస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పుట్ట సుజాత, జి.విజయ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన అటెండర్‌కు సన్మానం

మర్రిగూడ : మండలంలోని లెంకలపల్లి ఏపీజీవీబీ శాఖలో 38 సంవత్సరాలుగా అటెండర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కూరెళ్ల వెంకటేశంను ఆదివారం బ్యాంక్‌లో సన్మానించారు. నల్లగొండ రీజినల్ ఆఫీస్ సీనియర్ మేనేజర్ వెంకటేష్, బ్రాంచ్ మేనేజర్ జగదీష్‌రెడ్డి, క్యాషియర్ సాయికుమార్, ఉత్తరయ్య, కోరె సత్తయ్య, లింగారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం

రామగిరి(నల్లగొండ): స్థానిక శ్రీ శంకర గోశాలలో ఆదివారం పార్ధీవ స్ఫటిక లింగాలకు రుద్రాభిషేకం, రుద్ర హోమం నిర్వహించారు. రాపోలు శ్రీనివాస్, భాస్కర్, గణేశ్, వి జయ్, మోహన్, ఫణీంద్ర, శర్మ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సర్వారం చెరువు నిండేదెలా !



పూర్తిగా చెట్లతో నిండిపోయిన తిప్పర్తి మండలంలోని సర్వారం గ్రామంలో గల రాయిచెరువు



మైనర్ కాలువ దుస్థితి

- సర్వారం గ్రామంలో రాయి చెరువును కమ్మేసిన కంపచెట్లు
- అసంపూర్తిగా కాల్వ
- చెరువు నింపాలని రైతుల వేడుకోలు
- నీరు లేక అడుగంటిన భూగర్భ జలాలు

తిప్పర్తి : ప్రాజెక్టులు నిండి నీరు వృథా అవుతున్నా.. వర్షాలు విరివిగా కురిసినా.. ఆ చెరువు మాత్రం నిండలేదు.అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరించడంతో కాల్వలు పూర్తి కాలేదు. చెరువు నిండకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువు నిండా కంపచెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. తిప్పర్తి మండలం సర్వారం గ్రామంలో ఉన్న రాయి చెరువు చుక్క నీరు లేక కంపచెట్లతో దర్శనమిస్తోంది. మండలంలోని అన్ని చెరువులు జళకళ సంతరించుకున్నప్పటికీ ఆ చెరువులోకి మాత్రం నీరు చేరడం లేదు. సర్వారం గ్రామంలో ఉన్న రాయి చెరువు సుమారు 200 ఎకరాల్లో విస్తీర్ణం కలిగి ఉంది. ఈ చెరువు నిండినట్లయితే సుమారు 500 ఎకరాలకు పరోక్షంగా సాగు నీరు అందుతుంది. భూగర్భ జలాలు పెరిగి బోర్లు బాగా పోస్తాయి. రైతులకు సరిపడా సాగు నీరు, తాగు నీరు అందుతుంది. చెరువు నిండినట్లయితే రైతులకు పంటలు పండి కష్టాలు తీరుతాయి.

రైతుల పొలాల మీదుగానే చెరువులోకి నీరు..

తిప్పర్తి మండలంలోని సర్వారం గ్రామంలో ఉన్న రాయి చెరువుకు డీ–40 ప్రధాన కాలువ నుంచి ఆర్–24 మైనర్ కాలువ ఉంది. అయితే ఈ కాలువ చెరువుకు సుమారు 700 మీటర్ల దూరంలో ఆగింది. కాలువను పూర్తిచేసినట్లయితే చెరువుకు నీరు అందుతుంది. ప్రస్తుతానికి పొలాల మీద నుంచి వచ్చిన నీటితోనే చెరువులోకి కొద్దొగొప్పో నీళ్లు వస్తున్నాయి. కాలును పూర్తిచేసిన చెరువును నింపినట్లయితే భూగర్భ జలాలు పెరిగి బోరు మోటార్ల ద్వారా రైతులు పంటలు పండించుకుంటారు. కొద్ది దూరంలో అసంపూర్తిగా నిలిచిన కాలువను పూర్తి చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ కాలువను చెరువు దాకా కొనసాగించి చెరువును నీటితో నింపాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు.

కాలువ ఏర్పాటు చేయాలి



సర్వారం గ్రామంలో ఉన్న రాయి చెరువును నింపడానికి డీ–40 ద్వారా కాలువను ఏర్పాటు చేసి చెరువును నింపాలి. గతంలో రైతుల పొలాల మీదుగా నీరు వచ్చి చెరువు నిండేది. ప్రస్తుతం రైతులు పంటలు వేసుకున్నారు. ప్రభుత్వం స్పందించి చెరువును నింపి రైతులను ఆదుకోవాలి.

– సుంకబోయిన జానయ్య, రైతు, సర్వారం

చెరువు నిండితేనే బోర్లు పోస్తాయి



సర్వారం గ్రామంలో ఉన్న చెరువులో నీరు ఉంటేనే బోర్లు బాగా పోస్తాయి. చెరువులో నీరు లేకుంటే బోర్లు పోయవు. చెరువును నింపి రైతులను ఆదుకోవాలి. నీరు లేకుంటే యాసంగి పంటలు పండడం కష్టం. అధికారులు స్పందించి వెంటనే చెరువును నింపే ఏర్పాటు చేయాలి.

– తగుళ్ల మల్లయ్య,రైతు సర్వారం

రైతులు పరస్పర సహకారంతో చెరువు నింపుకోవాలి

డిస్ట్రిబ్యూటరీ పిల్ల కాలువలు గతంలో డిజైన్ చేసిన వరకు మాత్రమే కొనసాగుతాయి. వాటిని పెంచడానికి వీలు లేదు. రైతులు పరస్పర సహకారంతో ఆగిన కాలువ నుంచి నీటిని తరలించి చెరువు నింపుకోవాలి.

– ఆంజనేయస్వామి, ఏఎమ్మార్పీ డీఈ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్ : విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నకిరేకల్ పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యా దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రజాపాలన అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు పెద్దపీట వేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పేద విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందించడం కోసం నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, ఎంఈఓ మేకల నాగయ్య, స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం కోదాటి రాములు, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య, పన్నాల రాఘవరెడ్డి, కొండ వెంకన్న, బ్రహ్మదేవర రమేష్, యాసారపు వెంకన్న, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, చౌగోని సైదులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో ఆదివారం విద్యాశాఖ ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా 'పునరుత్పాదక ఇంధన వనరులు' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని తోకల సహాసరెడ్డి, ద్వితీయ బహుమతి గ్రీన్ గ్రోవ్ స్కూల్‌కు చెందిన బి.తరుణి, తృతీయ బహుమతి వెలిమినేడు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి ఎస్.శివకార్తీక్‌లు సాధించారు. వారికి ఎంఈఓ పానుగోతు సైదానాయక్ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. చిట్యాల జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం మాధవి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, సీఆర్పీలు ఆర్.జయకాంత్, జి.జాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గౌడ ఉద్యోగుల కార్తీక వనభోజనాలు

కట్టంగూర్ : కార్తీకమాసం చివరి రోజును పురస్కరించుకుని కట్టంగూర్ గౌడ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం, కార్తీక వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ రాఘవేంద్ర కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ సోమగాని శంకర్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ గౌడ ఉద్యోగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం వన భోజనాలు చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కట్టంగూర్‌కు చెందిన పోగుల యాదమ్మను జేఏసీ సభ్యులు పరామర్శించి రూ.20,516 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు యర్కల సత్తయ్యగౌడ్, కానుగు వెంకటేశ్వర్లు, చెనగోని శ్రీనివాసులు, పోగుల జగన్‌మోహన్, యర్కల శ్రీనివాస్, పాడిచేటి రాములు, గుండు నాగరాజు, పోలగోని రవికుమార్, పోలగోని జాని, యర్కల లక్ష్మీనారాయణ, పోగుల శంకర్, ఐతగోని సత్యనారాయణ, మాదగోని బాలు, పెద్ది సతీష్, దండెంపల్లి వెంకన్న, అయితగోని సైదులు తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో కోమటిరెడ్డికి సాటిరారు

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం

నల్లగొండ: పేదలకు, విద్యార్థులకు సహాయం చేయడంలో, సేవా కార్యక్రమాల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ కు ఎవరూ సాటిరారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో నల్లగొండ ప్రీమియర్ లీగ్ సీజన్–5 క్రికెట్ టోర్నమెంట్‌ను నీలగిరి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్‌తో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన తనయుడు ప్రతీక్‌రెడ్డిని కోల్పోయిన తర్వాత ఎంతోమంది పేద విద్యార్థుల చదువుకు సహకారం అందిస్తూ వారిలో తన కొడుకును చూసుకుంటున్నారని అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్లగొండ మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్లు, క్రికెట్ ఆర్గనైజర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, ప్రదీప్‌నాయక్, ప్రభాకర్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, మోహన్ బాబు, శంకర్, ఇంతియాజ్, ఆనంద్, రవి, ఆమేద్, జానయ్య, మధుసూదన్‌రెడ్డి, గణేశ్, కోటి, జూలకంటి సైదిరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకట్రామిరెడ్డి, సుభాష్ యాదవ్, రమేష్ యాదవ్, శ్యామ్, ఖలీల్, వీర బ్రహ్మానంద రెడ్డి, సాయి, రమేష్, నాగరాజు, కార్తీక్, ఈశ్వర్, ఆనంద్ రెడ్డి, అనిల్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

పీఆర్‌సీ ప్రకటించాలి

నల్లగొండ : ప్రభుత్వ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పీఆర్‌సీ ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలోని ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు కొనకంచి వీరరాఘవులు అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డు అందించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వీరరాఘవులు మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం అమలు బాధ్యత నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా తండ భానుప్రకాష్ గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసేవరకు పోరాడుతాం

చిట్యాల: ఎస్సీ వర్గీకరణ చేసేవరకు రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాన్ని కొనసాగిస్తామని మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం అన్నారు. చిట్యాలలో ఆదివారం జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల కమిటీల ఎన్నిక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా మేడి కృష్ణ, అధికార ప్రతినిధిగా మేడి అర్జున్, ప్రధానకార్యదర్శిగా కావలి కృష్ణ, ఉపాధ్యక్షుడిగా మేడి వీరస్వామి, కార్యదర్శిగా వడ్డెపల్లి భిక్షం, ప్రచార కార్యదర్శిగా అంబాల నవీన్‌లను ఎన్నుకున్నారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు నోముల పురుషోత్తం, అధికార ప్రతినిధిగా ఎరసాని సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా బుస్సు శంకర్‌లు ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ అధ్యక్షతన జరిగిన నకిరేకల్ నియోజకవర్గ ఎంఎస్‌పీ ఇన్‌చార్జ్ మేడి శంకర్, జిల్లా సహాయ కార్యదర్శి పెరిక లింగస్వామి, సురేష్, నర్సింహ, మత్స్యగిరి, మేడి శంకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చండూరు(గట్టుప్పల్) : మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి లక్ష్మణ్ స్నేహితులు ఆదివారం రూ.26,500, ఇదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రావుల రమేష్ రూ.5,000 అందజేశారు.

పోలీస్ కృష్ణయ్యకు ఘన నివాళి



నల్లగొండ టౌన్: పోలీస్ కృష్ణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు



నకిరేకల్ : నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: తెలంగాణ మలిదశ తొలి అమరుడు పోలీస్ కృష్ణయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని గడియారం సెంటర్‌లో కృష్ణయ్య చిత్రపటానికి ముదిరాజ్ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు వెలుగు రవి, బొమ్మరబోయిన కేశవులు, కేశబోయిన శంకర్, లోకనబోయిన రమణ, వెలుగు యాదయ్య, పాముల అశోక్, గుండెబోయిన రాములు, జిల్లబోయిన యాదయ్య, కోట్ల సైదులు, కోట్ల సునీతాదేవి , గీత, చాడ చక్రవర్తి, బైరు బలరాం, తవిటి సైదులు, గుండబోయిన లింగయ్య, సిద్ధం వెంకన్న, నిమ్మల సైదులు, మర్రి శ్రీనివాస్, తోట మధు, రాజు, పాండులు పాల్గొన్నారు.

నకిరేకల్ : తెలంగాణ మలి దశ తొలి అమరుడు పోలీస్ కృష్ణయ్య వర్ధంతిని మన ముదిరాజ్ మహాసభ మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నకిరేకల్‌లో జరుపుకున్నారు. మెయిన్ సెంటర్‌లోని కృష్ణయ్య చిత్రపటానికి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కనుకు వెంకటనారాయణ, మూసీ ప్రాజెక్టు మత్స్య సంఘం మాజీ చైర్మన్ సాదుల నర్సయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు అంబటి చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఎస్‌ఐ లచ్చిరెడ్డి, నక్క రాంబాబేష్, బండ మీద నర్సింహ, గందసిరి రామకృష్ణ, వనం చందర్ రావు, దాసరి భిక్షపతి, రమేష్, ప్రవీణ, వెంకన్న, నర్సయ్య, మల్లేష్, ముత్తయ్య పాల్గొన్నారు.

నీలగిరిలో టూ కే రన్



టూ కే రన్ ప్రారంభిస్తున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ పట్టణంలో టూకే రన్‌ను నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఎన్జీ కాలేజీ నుంచి పెద్ద గడియారం సెంటర్ వరకు టూ కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ టూ కే రన్ నిర్వహించడం ద్వారా యువతలో చైతన్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ విమల, సాఫ్ట్‌బాల్ సెక్రటరీ నాగిరెడ్డి, అథ్లెటిక్ సెక్రటరీ శంభులింగం, నాగరాజు, ఇమామ్ కరీం, నారాయణ, యావర్, కిరణ్‌కుమార్, నజీరుద్దీన్, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సింహయ్యకు నివాళి

నకిరేకల్ : మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య 4వ వర్ధంతిని నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, గాదగోని కొండయ్య, మర్రి వెంకటయ్య, వంటెపాక వెంకటేశ్వర్లు, ఆకుల భాస్కర్, దాసరి వీరార్జున్‌రెడ్డి, కొండ మట్టయ్య, గుండగోని వెంకన్న, లింగయ్య, బాలు, యాదగిరి, దొడ్డయ్యగౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన ఉత్సవాలకు నీలగిరి ముస్తాబు



నీలగిరి మున్సిపల్ కార్యాలయం



భాస్కర్ టాకీస్ వద్ద అంబేద్కర్ సర్కిల్



ఎన్జీ కాలేజీ వద్ద ..



క్లాక్ టవర్ వద్ద..

ప్రజా పాలన ఉత్సవాల సందర్భంగా నల్లగొండ పట్టణంలోని కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాలు,మున్సిపాలిటీతోపాటు ప్రధాన కూడళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

నల్లగొండ : పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలతోపాటు పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేసి పీఆర్సీ అమలు చేయాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి సి వి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన తపస్ జిల్లా కార్యనిర్వాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 17న హైదరాబాదులో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. గుర్రం ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్‌గౌడ్, బొలిశెట్టి భిక్షపతి, కోశాధికారి నంద్యాల నర్సిరెడ్డి, టీ దామోదర్‌రెడ్డి, కేశవ్, మహిళా కన్వీనర్ లతాకుమారి, వాణి, డి.వెంకట్‌రెడ్డి, బెల్లంకొండ రామ్మూర్తి, శంకర్‌రెడ్డి, చక్రధర్, రాజశేఖర్, రవి, రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చిట్యాల: మండలంలోని బోయగుబ్బ గ్రామానికి చెందిన రేగులగడ్డ సురేష్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో అతడి వైద్య చికిత్స కోసం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం అందజేశారు. ఆవుల సుందర్, గురిజ లింగస్వామి, పల్లపు ప్రశాంత్ పాల్గొన్నారు.

మునుగోడు: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన ఓర్సు నరేష్‌కు మంజూరైన రూ.39వేలు, ఓరుగంటి యాదమ్మకు మంజూరైన రూ.24వేల విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు అందజేశారు. మందుల బీరప్ప, గ్రామశాఖ అధ్యక్షుడు దండు లింగస్వామి, మందుల అంజయ్య, ఆరెకంటి పాపయ్య, వల్లూరి యాదయ్య, బొల్లం యాదగిరి, ఎల్లంకి రమేష్, కళ్ళెం యాదగిరి, ఐతగోని నగేష్, అద్దంకి రామలింగయ్య పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : తేరట్‌పల్లి గ్రామానికి చెందిన అనూష అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ.2,50,000 విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. గిరి సత్తయ్య, వీరయ్య, బెదరకోట శ్రీను, గిరి శంకర్, ఆంజనేయులు, కోటి, బండారి వెంకన్న, గౌరిగె స్వామి, సత్తయ్య తదితరులు ఉన్నారు.

కార్తీక పూజలు

కార్తీకమాసం చివరి రోజు సందర్భంగా ఆదివారం నల్లగొండ పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు, అభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించి కోనేరులో వదిలారు. బీట్ మార్కెట్‌లోని రామకోటి స్తూప ఆలయంలో అతిపెద్ద శివలింగం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ



ఛాయా సోమేశ్వరాలయంలో దీపాలు వెలిగించి కోనేరులో వదులుతున్న యువతులు



రామకోటి స్తూప ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



బీట్ మార్కెట్ రామకోటి స్తూప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బీట్ మార్కెట్ రామకోటి స్తూప ఆలయంలో ఆకాశ దీప పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఛాయా సోమేశ్వరాలయంలో అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు